క్లుప్తంగా

ఓటు నమోదు చేసుకోవాలి



గూడూరురూరల్: రెవెన్యూ డివిజన్‌లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితా అభ్యంతరాలపై ప్రతి మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఎలాంటి లోటుపాట్లు లేని ఓటరు జాబితా కోసం వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు.

ముగిసిన ఆరాధన

దక్కిలి: మండలంలోని దగ్గవోలు వెంకయ్య స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆరాధన మహోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు వెంకయ్య స్వామిని దర్శించుకున్నారు. రాత్రి నిర్వహించిన పౌరాణిక నాటకాలు రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, అనంతపురం నగరానికి చెందిన తిరుమల తేజ, రామకృష్ణ అధ్వర్యంలో ప్రదర్శించిన సత్య హరిచంద్ర నాటకం ,కర్ణ సందేశం, భక్త ఆంజనేయం ఏకపాత్రాభినయం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోలాటం, పండరి భజనలు భక్తులను అలరించాయి. మోపూరురోడ్డులోని వెంకయ్యస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

రక్తదానంతో ప్రాణదానం



గూడూరురూరల్: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ రవిప్రసాద్ అన్నారు. గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏబీవీపీ, మెగా బ్రదర్స్ సేవా సమితి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థినీవిద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల అధ్యాపకులు విశ్వక్సేనరెడ్డి, ఏటి కొండారెడ్డి, మనోజ్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గంబూసియా చేపలతో దోమల నివారణ



చిల్లకూరు: మురుగు గుంటలు, కాలువల్లో గంబూసియా చేపపిల్లలను వదలడంతో దోమలను నివారించవచ్చని వైద్యసిబ్బంది తెలిపారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లి సచివాలయం పక్కనే ఉన్న పాత కోనేరులో శుక్రవారం సర్పంచ్ పీ కోటమ్మ ఆధ్వర్యంలో గంబూసియా చేప పిల్లలను వదిలారు. ఉప సర్పంచ్ రమేష్‌రెడ్డి, వైద్యసిబ్బంది రవికుమార్, హరికృష్ణ,సుబ్బమ్మ, జమీర్‌బాషా పాల్గొన్నారు.

కోనేర్లులో గంబూసియా చేపలు



దొరవారిసత్రం: గ్రామంలోని కోనేరులో శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గంబూసియా చేపలను వదిలి పెట్టారు. దోమ లార్వాలను నిర్మూలించేందుకు గంబూసియా చేపలను డీవీ సత్రం, ఎన్ఎం అగ్రహారం, ముత్తరాశపాళెం గ్రామాల్లోని కోనేర్లలో కూడా వదిలిపెట్టుతున్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు విజయ్‌కుమార్, సుధాకర్, రత్నయ్య పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలు విస్తృతం

పెళ్లకూరు: నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సేవలను విస్తృతం చేసి, రైతులందరికీ రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆ బ్యాంకు చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులో జరిగిన బ్యాంక్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం బ్యాంక్ సేవలను విస్తృతపరచడంలో సహకరిస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్దాల నియామకంపై హర్షం

పెళ్లకూరు: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పాలచ్చూరు గ్రామానికి చెందిన మద్దాల సోమశేఖర్‌రెడ్డి నియమించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పలువురు నాయకులు సోమశేఖర్‌రెడ్డిని కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్ష ఎన్నికకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితరులకు సోమశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వరలక్ష్మీవ్రతం..భక్తి పారవశ్యం



రాపూరు: వ్రతంలో పాల్గొన్న మహిళలు



చిల్లకూరు: కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..



గూడూరురూరల్: రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో..



రాపూరు: విశేషాలంకరణలో వరలక్ష్మీదేవి



దక్కిలి : కొలికోటలో చెంచులక్ష్మీ కల్యాణం



దక్కిలి: వ్రతం ఆచరిస్తున్న మహిళలు

రాపూరు: పెంచలకోనలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదిలక్ష్మీదేవికి ఉదయం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, కొబ్బరినీరు, చందనం, పసుపు, కుంకుమ, పంచామృతం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం 10 గంటలకు ఆదిలక్ష్మీదేవి ఉత్సవమూర్తికి శ్రీవారి నందనవనం వేంచేపు చేసి, వరలక్ష్మీవ్రతం జరిపారు. వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, వ్రతం ఆచరించారు. ఈ కార్యక్రమానికి సీతారామయ్యస్వామి, రాజలక్ష్మి ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం దేవస్థానం అధికారులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి, ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, వినోద్‌స్వామి, ప్రసాద్ స్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

మహావిష్ణువు ఆలయంలో..

రాపూరు సమీపంలోని మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీదేవి వ్రతం నిర్వహించారు. భక్తులకు కలిమిలి వాసుదేవనాయుడు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

దక్కిలిలో..

దక్కిలి: మండలంలోని పలు ఆలయాల్లో వరలక్ష్మీవ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీ అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించి, వ్రతం ఆచరించారు. మండలంలోని కొలితోటలో ఉన్న చెంచమ్మతల్లి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం, అన్నదానం, అమ్మవారికి వెండి కవచ అలంకరణ, బుట్ట పూజ, వసంతోత్సవం, పల్లకీ సేవ, ఊంజల సేవ, నృత్య ప్రదర్శన నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి , చెంచులక్ష్మీ కల్యాత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే వెంబులూరు పంచాయతీలోని వెలుగొండలు కింద ఉన్న యోగలక్ష్మీనరసింహస్వామి (పెద్ద కోన) ఆలయంలో కూడా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. నిర్వాహుకులు విజయ్‌కుమార్, సుబ్బారావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సాముహిక లక్ష కుంకుమార్చన

నాయుడుపేటటౌన్: మండలంలోని పలు ఆలయాల్లో సామూహిక లక్ష కుంకుమార్చన, వరలక్ష్మీవ్రతం జరుపుకున్నారు. గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భగవతి మల్లికాంబ ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన సుమంగళి వ్రతం నిర్వహించారు. షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ అధ్వర్యంలో, వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు విట్టా శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గౌరీ వ్రత పూజలు నిర్వహించారు. అమ్మవారికి బంగారు చీరతో అలంకరించి, కలశాలలో గౌరీ ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను చేశారు. అఖిలాండేశ్వరీదేవి, మూకాంబి కాదేవి, బేరిపేటలోని మహాలక్ష్మి ఆలయం, నరసారెడ్డి కండ్రిగలోని మహాలక్ష్మి ఆలయాల్లో వరలక్ష్మీవ్రత పూజలు చేశారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: అమ్మవారి ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరిపూజ నిర్వహించి, లక్ష కుంమార్చనలు చేస్తుంటారు. కలవకొండ గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహిళలు వరలక్ష్మీ వ్రతం చేశారు. తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో గౌరి పూజలు, లక్ష కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. ఆయా ఆలయాల ట్రస్టు బోర్డు చైర్మన్లు కే ఆనందబాబు, సీ ఇంద్రసేనమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓజిలిలో..

ఓజిలి: వరలక్ష్మీవ్రతం సందర్భంగా పలు ఆలయాల్లో మహిళలు శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలంలోని కురుగొండ, ఆర్మేనిపాడు, వజ్జవారిపాళెం, మనవాలి గ్రామాల్లోని అమ్మణ్ణి ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

గూడూరులో..

గూడూరురూరల్: పట్టణంలోని మాళవ్యానగర్‌లో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ రోడ్డులో ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారు వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. పటేల్‌వీధిలోని శ్రీసాయి సత్సంగ నిలయం విజయదుర్గ ఉపపీఠంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దక్కిలి: ప్రత్యేకాలంకరణలో చెంచమ్మతల్లి





నాయుడుపేటటౌన్: పోలేరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, మల్లికాంబ ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



చిల్లకూరు: తూర్పుకనుపూరులో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని పాఠశాల ప్రతినిధులకు అప్పగిస్తున్న మహిళా పోలీస్, కానిస్టేబుల్

చిల్లకూరు: పాఠశాల నుంచి తప్పిపోయిన ఓ బాలుడ్ని సచివాలయంలో పని చేసే మహిళా పోలీస్ గుర్తించి, ఆ బాలుడ్ని పోలీసుల సమక్షంలో పాఠశాలల సిబ్బందికి అప్పగించిన సంఘటన శుక్రవారం చిల్లకూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న నిహాల్ అనే చిన్నారి పాఠశాల నుంచి తప్పించుకుని వెళ్లాడు. ఆ బాలుడు బజారులో వెళుతుండగా మహిళా పోలీస్ శాంతికి అనుమానం వచ్చి, అతడిని ప్రశ్నించగా సమాధానం దాట వేశాడు. దీంతో ఆమె బాలుడ్ని చిల్లకూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకునివచ్చి విచారించగా తన తల్లిదండ్రులు దుబాయ్‌కు కూలీ పనుల కోసం వెళ్లారని ప్రస్తుతం తన నానమ్మ రాపూరులో ఉండగా ఆమె వద్ద ఉండి చదువుకునే వీలు లేక పోవడంతో చిల్లకూరులోని ప్రైవేటు పాఠశాలలో హాస్టల్‌లో పెట్టి చదివిస్తున్నారని చెప్పాడు. తనకు స్కూల్‌లో ఉండడం ఇష్టం లేక వెళ్లిపోతున్నట్లు తెలిపాడు. దీంతో పోలీసులు పాఠశాలకు సమాచారం ఇవ్వగా పాఠశాల ప్రతినిధులు వచ్చి బాలుడ్ని తీసుకెళ్లారు.

కండలేరులో చెన్నై బృందం



కండలేరు జలాశయం వద్ద చెన్నై బృందం

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయాన్ని శుక్రవారం చెన్నై మెట్రోవాటర్, చెన్నై వాటర్ రిసోర్స్ బృందాలు సందర్శించాయి. కండలేరు అతిథి గృహంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కండలేరులో 14.884 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వివరించారు. సత్యసాయిగంగ కాలువకు 850, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిస్‌కు130, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు బృందానికి వివరించారు. అనంతరం కండలేరు హెడ్‌రెగ్యులేటర్, పికప్ ఏరు కాలువను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎస్సీ హరినారాయణరెడ్డి, ఈఈ విజయకుమార్, డీఈ విజయరామిరెడ్డి, చెన్నై మెట్రోవాటర్ చీఫ్ ఇంజనీర్ జయకర్‌దేసుదాస్, ఈఈ తిలైకరసై, రాజాచిదంబర్, పళనికుమార్, సతీష్‌కుమార్, అజయ్‌కుమార్, బాబయ్య, అనీల్ బాబు, జయకృష్ణ, గోపి, రేవతి పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు



సంక్షేమపథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరే అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బాలాయపల్లె మండలంలోని పిగిలాం కొత్తపాళెం, పిగిలాం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సంక్షేమ పథకాల అందుతున్నాయా? లేదా అని స్థానికులను ఆరా తీశారు. అలాగే వారికి ఎదురవుతున్న సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా అవినీతి రహిత పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వీ కార్తీక్‌రెడ్డి, సర్పంచ్ కే లక్ష్మి, ఉప సర్పంచ్ ఎం వెంకటేశ్వర్లు, సచివాలయం కన్వీనర్ జి గోపాల్‌యాదవ్, నాయకులు ఎం గురునాథం, దేవిక చౌదరి, రామతులసి, వి శ్రీహరి, వి వెంకటేశ్వర్లు, రామకృష్ణయ్య, సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తపస్సుమాను



మాతపరమేశ్వరి. పోతురాజు ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేట అరుంధతీయవాడలో ఉన్న మాత పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న కొలుపులో భాగంగా శుక్రవారం రాత్రి తపస్సుమాను వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి పూజరి మొండెం బాబు, గ్రామ పెద్దల సారథ్యంలో మాతపరమేశ్వరి, పోతురాజు, ఇతర దేవతల ప్రతిమలను ఊరేగింపుగా తపస్సుమాను వద్దకు వేంచేపు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తపస్సు వనం వద్ద ఏర్పాటు చేసిన పరశురాముని యుద్ధం నాటక ప్రదర్శన భక్తులకు కనువిందు చేసింది. కౌన్సిలర్లు పీ నాగార్జున, డీ రవి పాల్గొన్నారు.

వేడుకల్లో ఎమ్మెల్యే కిలివేటి

మాత పరమేశ్వరి కొలుపు వేడుకల్లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను కౌన్సిలర్లు పీ నాగార్జున, డీ రవితో పాటు గ్రామపెద్దలు పూలమాలలు వేసి శాలువలు కప్పి సత్కారించి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. తపస్సుమాను వద్ద జరిగిన పూజల్లో పాల్గొని, నిమ్మకాయను ఎమ్మెల్యే అందుకున్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కే దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, నాయకులు కే మాధవరెడ్డి, కే జయరామయ్య, బీ మల్లికార్జున రెడ్డి, పీ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నేదురుమల్లి నేతృత్వంలో పనిచేస్తాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి , సాయికృష్ణయాచేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కలిసి పనిచేసి, వైఎస్సార్ సీపీ పటిష్టతకు మరింత కృషి చేయనున్నట్లు వెంకటగిరి రాజా కుటుంబీకుడు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయి కృష్ణ యాచేంద్ర తెలిపారు. స్థానిక రాజాప్యాలెస్‌లో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత పటిష్టంగా పని చేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటగిరిలో ఇటీవల జరిగిన నేతన్ననేస్తం కార్యక్రమం నెల్లూరు జిల్లాలోనే ప్రత్యేకంగా నిలిచిందన్నారు. అనంతరం నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8వ తేదీన జరగనున్న మెగాజాబ్ మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుతో అధిక లాభాలు

చిల్లకూరు: సన్న, చిన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా మునగ సాగు చేసి లాభాలు ఆర్జించవచ్చని ఏపీఓ గిరిబాబు తెలిపారు. మండలంలోని కలవకొండలో ఉపాధి హామీ పథకం కింద సాగు చేస్తున్న మునగ సాగును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మునగ కాయలు, ఆకు, మార్కెట్ తరలించి, లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఆయన వెంట క్షేత్ర సహాయకులు నల్లయ్య ఉన్నారు.

రూ.12కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ



ఆధునీకరణ పనులను మ్యాప్‌ను పరిశీలిస్తున్న సదరన్ రైల్వే చీఫ్ ప్రిన్సిపల్ మేనేజర్ ఆనంద్

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను రూ.12 కోట్లతో ఆధునికీరిస్తున్నామని దక్షిణ రైల్వే చీఫ్ ప్రిన్సిపల్ మేనేజర్ వీ ఆనంద్ పేర్కొన్నారు. దక్షిణ రైల్వే డివిజన్ స్థాయి అధికారులతో కలిసి శుక్రవారం ప్రత్యేక రైలులో ఇక్కడికి విచ్చేసిన ఆయన రైల్వేస్టేషన్ నిర్మాణం పనులను పరిశీలించారు. స్టేషన్ నిర్మాణం మ్యాప్‌ను పరిశీలించి, ఎక్కడెక్కడ ఎలాంటి నిర్మాణాలు వస్తాయో ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ స్టేషన్‌లో అత్యంత అధునాతన సేవలను రైల్వే ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు సంబంధించి ఈ ప్రాంతంలో శ్రీహరికోట రాకెట్‌కేంద్రం, శ్రీసిటీ సెజ్, మాంబట్టు తదితర సెజ్‌లు ఉండడంతో ఈ స్టేషన్‌ను రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రాచుర్యం పొందిన చెంగాళమ్మ పరమేశ్వరి ప్రతిమను స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేయించే బాధ్యతలతో పాటు నాణ్యత ప్రమాణాలు విషయంలో అత్యంత బాధ్యతాయుతంగా పని చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు.

మహిళా సాధికారతే సీఎం జగనన్న లక్ష్యం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట: మహిళా సాధికారితే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని అతివలు ఆర్థిక స్వావలంభన సాధించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీలోని కల్యాణ మండపంలో మెప్మా, వైఎస్సార్ కాంత్రి పథం మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం స్వీకారం చేసే నాటికి డ్వాక్రా మహిళలు బ్యాంకులకు చెల్లించాల్సిన అప్పు రూ.25,640 వేల కోట్లు ఉండేదన్నారు. నాలుగు విడతల్లో సంఘ బంధాలు చెల్లించాల్సిన అప్పును బ్యాంకులకు చెల్లించి, వడ్డీమాఫీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేనన్నారు. అలాగే మహిళలు సాధికారత సాధించాలన్న ఉద్దేశంతో చేయూత, ఆసరా తదితర పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీదేనని చెప్పారు. దళారీ వ్యవస్థను రూపుమాపి, పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచారన్నారు. లోకేష్ బాబు యువగళం సభలో ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ నెలవల మమత, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఓ రాధా కిషోర్, ఈ రత్నశ్రీ , వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోర్డినేటర్ మురళి, ఎంపీఎంలు ప్రసన్న కుమారి, నిర్మలమ్మ, మునిరాజయ్య, సీసీలు శ్రీపతి మురళి, సుబాషిణి, రెడ్డమ్మ, మణెమ్మ, సీఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

జగనన్న ఆశయాల సాధనకు పనిచేద్దాం

వెంకటగిరిరూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల సాధనకు చేద్దామని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్‌జేఆర్ భవనంలో వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి మున్సిపాలిటీ, వెంకటగిరి రూరల్, బాలాయపల్లె, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల సోషల్‌మీడియా కో- కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేదురుమల్లికి అభినందనలు

వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నేదురుమల్లి మళ్లీ నియమితులు కావడంతో పలువురు నేతలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరించి, అభినందించారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా సీ హరికృష్ణకు అవకాశం కల్పించడంపై నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.